
సాక్షి ఒడిశా

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తుల కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,26,510లు, బంగారం 750 మిల్లీగ్రాములు, వెండి 15 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చేనేత వస్త్రాలు ధరించండి

సంప్రదాయ దుస్తుల సంబరాలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగులు చేనేత దుస్తులు ధరించారు. - 8లో



జాదవ మజ్జికి ఘన నివాళి

దివంగత మంత్రి జాదవ మజ్జికి ఘన నివాళులర్పించారు. వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

రెవెన్షా క్యాంపస్‌లో ఉద్రిక్తత



వైస్ చాన్స్‌లర్ కార్యాలయం వద్ద విద్యార్థుల నిరసన ప్రదర్శన

భువనేశ్వర్: కటక్‌లోని రెవెన్షా విశ్వ విద్యాలయం ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. హాస్టల్‌కు బయట వారు వస్తుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. బయటి వ్యక్తుల ప్రవేశం, దాడులను వ్యతిరేకిస్తూ విద్యార్థులు నిరసన చేస్తున్నారు. వైస్ చాన్స్‌లర్ కార్యాలయం ముంగిట విద్యార్థులు ఆందోళన చేశారు.

దుబాయ్‌కు రాష్ట్ర పంటలు



దుబాయ్ ఎగుమతికి పచ్చ జెండా ఊపిన రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికార వర్గం

భువనేశ్వర్: రాష్ట్రంలో పంటలకు అంతర్జాతీయ గిరాకీ లభించింది. ఇక్కడ పండించిన కూరగాయలు పొటల్స్, మునగకాయలు విదేశాలకు ఎగుమతి కావడం విశేషం. ఈ ఉత్పాదనలను స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దుబాయ్‌కు అంతర్జాతీయంగా రవాణా చేశారు. దీంతో ఒడిశా వ్యవసాయ ఎగుమతుల్లో ఒక మైలురాయిని సాధించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ హర్షం వ్యక్తం చేసింది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదానికి గురైన ఆటో, బైక్‌లు

జయపురం: సబ్ డివిజన్ పరిధి కుంద్ర సమితి కావిడియగుడ ఎస్ఎస్‌డీ ఉన్నత పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బుధవారం సాయంత్రం సురేంద్ర హరిజన్ తన బైక్‌పై కుమార్తె రాహిల్‌తో కలిసి కుంద్ర నుంచి దిగాపూర్ వెళ్తున్నాడు. కాగా కావిడియగుడ ఉన్నత పాఠశాల సమీపంలో ఒక ఆటో వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సురేంద్ర ముఖం, చెవులకు బలమైన గాయాలయ్యాయి. ఆటోలో కూర్చున్న బిభుతి పట్నాయిక్ కాలుకి దెబ్బలు తగిలాయి. రాహిల్‌కు తలపై గాయమవ్వడంతో పాటు కాలు విరిగింది. ప్రమాదాన్ని చూసిన పాఠశాల ఉపాధ్యాయుడు దేవేంద్ర శనాపతి, సామాజిక కార్యకర్త సుందరబారిక్ మల్ల, లొబి కొరలియలు గాయపడిన వారిని వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు క్వింటాళ్ల తాబేళ్ల అక్రమ తరలింపు



తాబేళ్లను తరలిస్తున్న వాహనం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి మోటు చెక్‌గేట్ వద్ద గురువారం తాబేళ్ల అక్రమ తరలింపును పోలీసులు అడ్డుకున్నారు. ఎంవీ 79 గ్రామం వద్ద ఓ మినీ వ్యాన్‌లో 6 క్వింటాళ్ల తాబేళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ తాబేళ్లను ఆంధ్రా నుంచి అక్రమంగా కలిమెలకు తరలిస్తున్నారు. మొత్తం 300 తాబేళ్లు ఉన్నాయి. ఎంవీ 88 గ్రామానికి చెందిన సురాజ్ మాల్లిక్, ఎంవీ 83 గ్రామానికి చెందిన శక్తి పథ్‌లను అరెస్టు చేశారు. తాబేళ్ల విలువ రూ.5 లక్షలకుపైనే ఉంటుందని మోటు ఫారెస్టర్ మురళి తెలిపారు.

రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ



కేంద్ర రైల్వే మంత్రితో ఎంపీ బలభద్ర మజ్జి

కొరాపుట్: కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ శ్రీవైష్ణవ్‌ను నబరంగ్‌పూర్ బీజేపీ ఎంపీ బలభద్ర మజ్జి గురువారం న్యూ ఢిల్లీలో కలిశారు. రైల్వే, ఇన్ఫర్మేషన్, బ్రాడ్ కాస్టింగ్, తదితర అంశాలపై చర్చించారు. ఒడిశా రాష్ట్రంలో రైల్వే, తదితర శాఖలలో అనేక ఖాళీలు ఉన్నాయని గుర్తు చేశారు. ఆయా ప్రభుత్వ ఖాళీలు సామరస్య పూర్వకంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రభుత్వ పథకాల గూర్చి ప్రజల్లోకి మంచి సందేశం వెళ్తుందన్నారు.

రాత్రంతా కొనసాగిన సభ



రాష్ట్ర శాసన సభ

- ఉదయం 4.29 గంటలకు విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు - 2024కు ఆమోదం
- శాసన సభ చరిత్రలో రికార్డు

భువనేశ్వర్: శాసన సభ చరిత్రలో కొత్త రికార్డు నెలకొంది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత రాత్రి అంతా సభ నిరవధికంగా కొనసాగింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు శాసన సభ రాత్రంతా కొనసాగింది. విశ్వ విద్యాలయ సవరణ బిల్లు-2024 గురువారం ఉదయం 4.29 గంటలకు ఆమోదించారు. ఆ వెంబడి రాష్ట్ర రహదారుల అథారిటీ బిల్లు 2024ను సహాయ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్ ప్రవేశపెట్టారు. విశ్వవిద్యాలయ సవరణ బిల్లుపై ప్రతిపక్షం, అధికార పక్షం మధ్య సుదీర్ఘంగా వాడీవేడీ చర్చ జరిగింది. ప్రతిపక్ష పార్టీ తరపున సీనియర్ ఎమ్మెల్యేలు రణేంద్ర ప్రతాప్ స్వంయి, డాక్టర్ అరుణ్ కుమార్ సాహు, గణేశ్వర్ బెహరా, ధ్రువ్ చరణ్ సాహు బిల్లుకు వ్యతిరేకంగా బలమైన వాదనలు లేవనెత్తారు. ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్య వంశీ సూరజ్ కూడా ప్రతిపక్షాలకు ధీటుగా స్పందించారు. అధికార పార్టీకి చెందిన దాదాపు అందరు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఓటింగ్ జరుగుతున్నప్పుడు హాజరు కాని ఎమ్మెల్యేలు ఎందుకు రాలేదని ముఖ్యమంత్రి నిలదీశారు. గైర్హాజరైన ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి ఫోన్ చేసి ఎందుకు హాజరు కాలేదని అడిగారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు విశ్వవిద్యాలయ సవరణ బిల్లు-2024పై చర్చ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రతిపక్షం, అధికార పక్షం మధ్య తీవ్ర వాగ్యుద్ధం చోటు చేసుకుంది. విపక్ష బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే డాక్టర్ అరుణ్ కుమార్ సాహు 3 గంటల 10 నిమిషాలకు పైగా, రణేంద్ర ప్రతాప్ స్వంయి ఒకటిన్నర గంటలకు పైగా, గణేశ్వర్ బెహెరా 1 గంటకు పైగా తమ వాదనలను వినిపించారు. ఉన్నత విద్యా విభాగం మంత్రి సూర్యవంశీ సూరజ్ కూడా గంటకు పైగా ఎదురు దాడి చేశారు. అధికార పక్షం భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యేలు కూడా చర్చలో పాల్గొని ప్రతిపక్షాలను తీవ్రంగా ప్రతిఘటించారు. సుదీర్ఘంగా పన్నెండున్నర గంటల పాటు చర్చ కొనసాగింది. చర్చల తర్వాత విశ్వవిద్యాలయాల సవరణ బిల్లు 2024 అసెంబ్లీలో ఆమోదించారు. ఒడిశాలో విద్యా వ్యవస్థ ఉషోదయం అవుతుందని ఉన్నత విద్యా శాఖ మంత్రి అన్నారు. బిల్లును ఆమోదించినందుకు సభ్యులందరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత రాష్ట్ర రహదారుల అథారిటీ బిల్లు ఆమోదంపై చర్చలు ప్రారంభం అయ్యాయి. విశ్వ విద్యాలయాల సవరణ బిల్లు 2024 ఆమోదం పొందిన తర్వాత బీజేపీ ప్రభుత్వం ఒక సాహసోపేతమైన బిల్లును తీసుకువచ్చిందని బీజేడీ ఎమ్మెల్యే అరుణ్ సాహు అన్నారు. 2024లో ప్రవేశపెట్టిన బిల్లు 1989 బిల్లుకు సవరణగా వ్యాఖ్యానించారు. బిల్లు చట్టబద్ధతపై తర్వాత సుప్రీంకోర్టులో చర్చిస్తామని ఆయన అన్నారు. ఇదిలా ఉండగా, శాసన సభలో ప్రజాస్వామ్యం పునరుద్ధరించబడిందని బీజేపీ ఎమ్మెల్యే ఇరాషిస్ ఆచార్య అన్నారు. పన్నెండున్నర గంటల చర్చ తర్వాత విశ్వవిద్యాలయ సవరణ బిల్లు ఆమోదించారు. క్లాజుల వారీగా జరిగిన చర్చలో విపక్షాల సభ్యుల అన్ని సందేహాలకు ఉన్నత విద్యా శాఖ మంత్రి నివృత్తి పరిచారు. ఈ బిల్లు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకువస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విశ్వవిద్యాలయం అధికారాలను పరిమితం చేసింది. తాజా సవరణతో విశ్వ విద్యాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించారు. కొత్త బిల్లు ప్రభుత్వ నియంత్రణను తగ్గిస్తుందని మంత్రి వివరించారు. రాత్రంతా కొనసాగిన సభా సమావేశంలో నిరవధికంగా హాజరై ఉండడంతో విశ్వవిద్యాలయ సవరణ బిల్లులో సంస్కరణల్ని అర్థం చేసుకునే అవకాశం లభించిందని కొత్త ఎమ్మెల్యేలు ఆనందం వ్యక్తం చేశారు.

శాసన సభ బడ్జెట్ సమావేశాలకు తెర

- సభ నిరవధికంగా వాయిదా: స్పీకర్

భువనేశ్వర్: 17వ శాసన సభ మూడో విడతలో బడ్జెట్ సమావేశాలు గురువారంతో ముగిశాయి. మూడు పని దినాలు ఉంటుండగా శాసన సభలో సమావేశాలకు ముందస్తుగా తెర దించేశారు. సభా కార్యక్రమాలను నిరవధికంగా వాయిదా వేసినట్లు స్పీకరు సురమా పాఢి ప్రకటించారు. 28 పని దినాల్లో 25 పని దినాలు పూర్తయ్యాయి. సభలో తదుపరి చర్చకు ప్రముఖమైన అంశాలు లేనందున అధికార పక్షం చీఫ్ విప్ సభను నిరవధికంగా వాయిదా వేయాలని ప్రతిపాదించారు. దీనికి అనేక మంది ఎమ్మెల్యేలు మద్దతు ప్రకటించారు. అనంతరం స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.

అన్నీ తొలి అనుభవాలే

17వ శాసన సభ మూడవ సమావేశం అత్యంత ఆకర్షణీయంగా జరిగింది. ఈ సమావేశాల్లో పలు ఆసక్తికరమైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధం అనునిత్యం కొత్త మలుపులు తిరుగుతు ఉత్కంఠ రేపింది. ఈ నేపథ్యంలో శాసన సభ చరిత్రలో తొలిసారిగా గందరగోళం సృష్టించిన సభ్యుల్ని స్పీకరు సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసి సంచలనం రేపారు. స్పీకర్ ఆగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సభ్యులు బలి అయ్యారు. ఆ పార్టీకి చెందిన మొత్తం 14 మంది ఎమ్మెల్యేల్ని స్పీకరు సభ నుంచి సస్పెండ్ చేశారు. దీనిపై తీవ్ర అసంతృప్తికి గురైన కాంగ్రెసు ఎమ్మెల్యేలు సభ బయట నిరవధికంగా నిరసన ప్రదర్శించారు. ఈసారి వీరంతా ఘంటానాదం, తాళాల వాయింపు, వేణు గానం, డోలక్ బజాయింపు వంటి విన్యాసాలతో సభలో గందరగోళ పరిస్థితిని ఆవిష్కరించారు. మరో వైపు ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ శాసన సభ ప్రాంగణం శుద్ధి చేసింది. ప్రజా సమస్యలపై ఉద్యమించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఏకపక్ష నిర్ణయంతో సస్పెండు చేయడాన్ని బీజేడీ వ్యతిరేకించింది. ఈ క్రమంలో స్పీకరు భారత రాజ్యాంగం వ్యతిరేక చర్యకు పాల్పడ్డారు. ఈ చర్యతో పవిత్ర సభా స్థలం అపవిత్రమైంది. ఈ అపవిత్రత తొలగించేందుకు విపక్ష బీజేడీ సభ్యులు ఇత్తడి కలశాల్లో గంగా జలం సభా ప్రాంగణానికి తీసుకుని వచ్చి సభ ప్రాంగణం నలు మూలలా శుద్ధి చేసి శాంతియుతంగా నిరసన ప్రదర్శించారు. బిజూ జనతా దళ్ ఈ విడత సమావేశాల్లో సుమారు నిత్యం నిరసన ప్రదర్శనకు ముందంజ వేయడం గమనార్హం.



స్పీకరు సురమా పాఢి

రాత్రంతా సభలో సందడే

రాష్ట్ర విశ్వవిద్యాలయ సవరణ బిల్లు, రాష్ట్ర రహదారుల అథారిటీ బిల్లుపై చర్చలు పురస్కరించుకుని శాసన సభ రాత్రంతా కొనసాగింది. బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ సభ గురు వారం ఉదయం 7.05 గంటల వరకు నిరవధికంగా కొనసాగింది. స్పీకర్ ఆదేశాల మేరకు సభా కార్యకలాపాల నుంచి సస్పెన్షన్‌కు గురైన కాంగ్రెస్ సభ్యులు రాత్రి అంతా సభ ప్రధాన ప్రాంగణంలో నిరవధికంగా నిరసన ప్రదర్శించారు. రాత్రి పూట అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా అర్ధరాత్రి 2.15 గంటల ప్రాంతంలో శాసన సభ లోపలి నుంచి కాంగ్రెసు సభ్యుల్ని బలవంతంగా బయటకు తొలగించారు. దీంతో మరింత నిరుత్సాహానికి గురైన కాంగ్రెస్ సభ్యులు సభ బయట ఆందోళన ఉధృతపరిచారు. కాంగ్రెసు భవన్ సమీపం మాస్టరు క్యాంటీన్ కూడలి ప్రాంతంలో వీరంతా నడి రోడ్డు మీద రాత్రంతా బైఠాయించి తీవ్ర అలజడి రేపారు. ఈ ఆందోళన ప్రభావంతో పలువురు ఎమ్మెల్యేలు అస్వస్థతకు గురయ్యారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



క్షతగాత్రులను అత్యవసర వాహనంలో పంపిస్తున్న ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



రోడ్డు పక్కన ఉన్న క్షతగాత్రులు

కొరాపుట్: రోడ్డు ప్రమాద బాధితులను నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి ఆదుకుని మానవత్వం చాటుకున్నారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి వైపు ఎమ్మెల్యే వెళ్తున్నారు. అదే సమయంలో కుంటియా జంక్షన్ వద్ద బైక్ యాక్సిడెంట్ జరిగి ఇద్దరు క్షతగాత్రులు రోడ్డు పక్కన తోటలో పడి ఉన్నారు. ఇది గమనించిన ఎమ్మెల్యే తన వాహనం నిలిపి వారి వద్దకు వెళ్లి మంచినీరు తాగించారు. వెంటనే పోలీసులకు, జిల్లా కేంద్ర ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. అత్యవసర వాహనం 112లో వారిని ఆస్పత్రికి పంపించారు.

ఉచిత విద్యుత్ ఉత్తి మాటే

భువనేశ్వర్:

వినియోగదారులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందిస్తామని భారతీయ జనతా పార్టీ ఎన్నికల హామీని ప్రకటించింది. వాస్తవ కార్యాచరణలో సామాన్య ప్రజలకు తీవ్ర నిరుత్సాహం మిగిల్చింది. రాష్ట్రంలో 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు ఎలాంటి ప్రణాళికలు లేవని విద్యుత్ శాఖామాత్యులుగా కొనసాగుతున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ శాసన సభలో ప్రకటించారు. ఈ హామీ నీటి మూటగా పరిణమించింది. గద్దెనెక్కిన భారతీయ జనతా పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ దేవ్ సభలో చేసిన ప్రకటన కొత్త దుమారం రేపుతుంది.

సౌర శక్తి ఊరట

300 యూనిట్ల ఉచిత విద్యుత్ బదులుగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన కింద పైకప్పు సౌరశక్తిని ప్రోత్సహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ పథకం కింద రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్‌లను ఏర్పాటు చేయడం ద్వారా తమ విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంలో ఆసక్తి ఉన్న గృహ వినియోగదారులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. పైకప్పులపై 3 కిలోవాట్ల వరకు సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం రూ. 78,000 సబ్సిడీ, రాష్ట్ర ప్రభుత్వం రూ. 60,000 సబ్సిడీ అందిస్తుందని మంత్రి వివరించారు. ఈ పథకాన్ని ఉపయోగించుకోవడం ద్వారా వినియోగదారులు నెలకు దాదాపు 300 యూనిట్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చని ఆయన అన్నారు. 2024-25 నుంచి 2026-27 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఈ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,800 కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందని కనక వర్ధన్ సింగ్ దేవ్ తెలిపారు. ఇప్పటివరకు, మొత్తం 97,128 మంది ప్రధాన మంత్రి సూర్య ఘర్ ఉచిత విద్యుత్ యోజన నుంచి ప్రయోజనం పొందడానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే 3,124 గృహాల పైకప్పులపై సౌర ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఈ పథకం కింద సౌర విద్యుత్‌ను స్వీకరించడం వల్ల రాష్ట్రంలో లోడ్ షెడ్డింగ్‌ను తగ్గించడంలో, విద్యుత్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో సహాయపడుతుందని మంత్రి ఉద్ఘాటించారు.

30 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన నిందితుడు, గంజాయితో పోలీసులు

కొరాపుట్: కొరాపుట్ జిల్లా సిమిలిగుడ పోలీసులు 30 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గురువారం సిమిలిగుడ - పొట్టంగిల మధ్య జాతీయ రహదారి-26పై విడా ఆఫీస్ సమీపంలో లైట్‌హౌస్ చర్చి వద్ద అనుమానాస్పదంగా ఒక వ్యక్తి సంచరించడం పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని సోదాలు చేయగా, అతని బ్యాగులో 30 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితుడు గంజాం జిల్లా బైద్యనాథ్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జయదుర్గానగర్‌కి చెందిన రాహుల్ కుమార్ బుయ్యాన్‌గా గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకి తరలించారు. ఈ కేసుని ఎస్ఐ బాబాజీ చరణ్ కన్వర్ దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో పడి వృద్ధుడు మృతి



సంఘటన స్థలంలో సన్యా బొడనాయక్ మృతదేహం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీస్‌స్టేషన్ పరిధిలో జాముగుఢా గ్రామానికి చెందిన సన్యా బొడనాయక్ (75) అనే వృద్ధుడు గురువారం ఉదయం కాలువలో పడి మృతి చెందాడు. సన్య బొడనాయక్ బుధవారం సిందిగూడ గ్రామం మీదుగా రాస్‌బెడ వెళ్లడానికి హరి అనే వ్యక్తితో కలిసి బయల్దేరారు. దారిలో వీరిద్దరూ సిందిగూడలో విశ్రాంతి తీసుకున్నారు. ఈ లోగా హరి తాను ఇంటికి వెళ్లి తమ వారిని పట్టుకుని వస్తానని, అంతవరకు అక్కడే ఉండాలని సన్యాకు సూచించాడు. అతను వెళ్లాక సన్యా పక్కనే ఉన్న కాలువలో దిగి కాలుజారి పడిపోయాడు. ఇంతలో అక్కడకు చేరుకున్న కుటుంబ సభ్యులు చుట్టూ వెతికారు. కాలువ వైపు చూడగా.. సన్యా తేలి ఉండడం గమనించి బయటకు తీసి చూడగా.. ఆయన చనిపోయారు. దీంతో వెంటనే బలిమెల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో ఐఐసీ ధీరాజ్ పట్నాయిక్ తన సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని బలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగిస్తామని పోలీసులు తెలిపారు.

• రామ నవమికి రంగవల్లులు



ఈ ఏడాది ప్రారంభం కానున్న శ్రీ రామ నవమి ఉత్సవాలకు స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి (ఏసీఏ) భారీ సన్నాహాలు చేస్తోంది. సమితి భవన ప్రాంగణంలో ఈ నెల 6 వ తేదీ నుంచి శ్రీ రామ నవమి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా ఉత్సవ ప్రాంగణం ఆకర్షణీయమైన రంగవల్లులతో రూపుదిద్దుకుంటుంది. ఉత్సవ ఏర్పాట్లలో సమితి సభ్యులు తలమునకలై ఉన్నారు. - భువనేశ్వర్

భారీ వర్షంతో రాకపోకలు బంద్



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు



బురదలో కూరుకుపోయిన భారీ వాహనం



నిలిచిపోయిన అంబులెన్స్



బురదలో కూరుకుపోయిన వాహనాలు



కొరాపుట్ వైపు నిలిచిన వాహనాలు

కొరాపుట్: కొరాపుట్-సునాబెడా పట్టణాల మధ్య గురువారం వేకువజామున కురిసిన భారీ వర్షానికి జాతీయ రహదారి స్తంభించిపోయింది. ఆ ప్రాంతంలో ప్రస్తుతం నిర్మితమవుతున్న మార్గం బురదమయం కావడంతో ఈ దుస్థితి నెలకొంది. రాయ్‌పూర్-విశాఖపట్నం జాతీయ రహదారి-26 కావడంతో దాని ప్రభావం మూడు రాష్ట్రాలపై పడింది. రాత్రిపూట సుదూర ప్రాంతాల నుంచి వచ్చి, వెళ్లే అంతర్రాష్ట్ర బస్సులు పదుల సంఖ్యలో నిలిచిపోయాయి. సుమారు 7 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిలిచిపోయిన వాహనాల్లో అంబులెన్సులు కూడా ఉండడంతో రోగులకు అవస్థలు తప్పలేదు.

క్లుప్తంగా

బెంచీల వితరణ



గాంధీనగర్ పాఠశాలకు డెస్క్‌బెంచీలను పంపిణీ చేసిన సీఎస్‌ఆర్ అధికారులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో గల ఉత్కళ అల్యూమినియం కర్మాగారం సీఎస్‌ఆర్ సేవా కార్యక్రమాల్లో భాగంగా జిల్లాల్లోని వివిధ పాఠశాలలకు డెస్క్ బెంచీలను వితరణ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం 25 పాఠశాలల్లో 707 డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. జిల్లాలో గల 11 సమితుల్లో ఉన్న 72 ప్రాథమిక పాఠశాలల్లో 2013 డెస్క్ బెంచీలను పంపిణీ చేసేందుకు సన్నహాలు ప్రారంభించారు. స్థానిక గాంధీనగర్ పాఠశాలలో కర్మాగారం సీఎస్‌ఆర్ విభాగానికి చెందిన అధికారులు డెస్క్ బెంచీలను పంపిణీ చేశారు. విద్యా విధానంలో ప్రభుత్వ సరికొత్త మార్పులు తీసుకువస్తున్న నేపథ్యంలో తమవంతు సహకారంగా ఈ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కర్మాగారం ప్రతినిధులు తెలిపారు.

పార్టీ విప్ జారీ చేయలేదు: బీజేడీ

భువనేశ్వర్: జాతీయ స్థాయిలో వక్ఫ్ బిల్లుపై చర్చ వాడీవేడిగా సాగుతోంది. ఎగువ సభలో దీని ఆమోదం కోసం సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో బిజూ జనతా దళ్ వైఖరి మీద అందరి దృష్టి కేంద్రీకృతమైంది. బీజేడీ అధ్యక్షుడు విభిన్న శైలిలో స్పందించారు. రాజ్య సభలో వక్ఫ్ బిల్లు పట్ల పార్టీ ఎంపీలు స్వీయ విచక్షణతో స్పందించాలని స్వేచ్ఛని కల్పించారు. ఈ నేపథ్యంలో రాజ్య సభలో వక్ఫ్ బిల్లు ప్రవేశం పురస్కరించుకుని బీజేడీ అధిష్ఠానం ఎలాంటి విప్ జారీ చేయలేదు. ఈ సందర్భంగా బీజేడీ జాతీయ అధికార ప్రతినిధి సస్మిత్ పాత్రో మాట్లాడుతూ తమ పార్టీ రాజ్య సభలోని సభ్యులకు న్యాయం, సామరస్యం, అన్ని వర్గాల హక్కుల ప్రయోజనాల కోసం మనస్సాక్షితో స్వీయ విచక్షణకు అనుగుణంగా స్పందించే బాధ్యతను అప్పగించిందని తెలిపారు. బిల్లు పట్ల ఓటింగ్ పరిస్థితి చోటు చేసుకున్న ఎటువంటి ఆంక్షలు లేకుండా పార్టీ విప్ కూడా జారీ చేయకపోవడం విశేషంగా పేర్కొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మంగరాజు

సోంపేట: మండలంలోని కొర్లాం జాతీయ రహదారి వద్ద గంజాయి తరలిస్తున్న వ్యక్తిని బారువ ఎస్ఐ హరిబాబునాయుడు అరెస్టు చేశారు. సోంపేట సర్కిల్ పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ బి.మంగరాజు గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొర్లాం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. తనిఖీ చేయగా 1.050 కిలోల గంజాయి పట్టుబడింది. నిందితుడు ఒడిశా నుంచి బాపట్లకు గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు సీఐ తెలిపారు. సమావేశంలో బారువ ఎస్ఐ హరిబాబునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు

పక్కాగా విద్యార్థుల డేటా

శ్రీకాకుళం న్యూకాలనీ : పాఠశాలలో చదువుతున్న ఉన్న విద్యార్థుల సంఖ్య, ఆన్‌లైన్‌లో ఉన్న విద్యార్థు ల సంఖ్య కచ్చితంగా ఉందో లేదో ప్రధానోపాధ్యా యులు సరిచూసుకోవాలని విద్యాశాఖ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. ఏ విద్యార్థి పేరైనా ఆన్‌లైన్‌లో లేనట్టయితే.. వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఈ నెల 5 వరకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో చూపించే ఎన్‌రోల్‌మెంట్‌నే బదిలీలకు ప్రామాణికంగా తీసుకోనున్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయులంతా తప్పనిసరిగా ఒకసారి విద్యార్థుల డేటాను సరిచూసుకోవాలని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి జిల్లాకు చెందిన బచ్చు వరలక్ష్మి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులకు విరాళ చెక్కును అందించారు. ఈ సందర్భంగా శోభనాద్రాచార్యులు మాట్లాడుతూ రూ.లక్ష అంతకుమించి విరాళాలిచ్చిన దాతలకు రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనానికి డోనర్ పాసులిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు

ఆన్‌లైన్‌లో కూచిపూడి నాట్య శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: కూచిపూడి నాట్య శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు నగరానికి చెందిన ప్రముఖ నాట్యకారిణి స్వాతి సోమనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ కోర్సు, డిప్లమో కోర్సులు, ఎంఏ కూచిపూడి డ్యాన్స్‌లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9849107426 నంబరును సంప్రదించాలని కోరారు.

చేనేత వస్త్రాలను ధరించండి



సంప్రదాయ దుస్తులు ధరించిన ఉద్యోగులు

పర్లాకిమిడి: ఒడిశా మినిస్టీరియల్ ఉద్యోగులు గురువారం కలెక్టరేట్‌లో ఒడిశా సంప్రదాయ చేనేత వస్త్రాలతో 'అమొ పోసోకో..అమొ పరిచయ్' అనే కార్యక్రమాన్ని అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్ అధ్వర్యంలో గురువారం నిర్వహించారు. డీఆర్‌డీఏ ముఖ్యకార్య నిర్వాహణ అధికారి శంకర్ కెరకటా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, డీఆర్‌డీఏ అదనపు ఈఓ పృథ్వీరాజ్ మండల్, సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్ తదితరులు హాజరయ్యారు. జిల్లా కేంద్రంలో పలు ప్రభుత్వశాఖల అధికారులు, ఉద్యోగులు సంబల్‌పురి చేనేత వస్త్రాలు ధరించి ఒడిశా పక్షోత్సవాలను నిర్వహించారు. ఒడిశా భాష, సాహిత్యం, సంస్కృతి విభాగం ఆదేశాల మేరకు ఏప్రిల్ 1 నుంచి 15వ తేదీ వరకు ఈ పక్షోత్సవాలు జరుగుతాయని ఏడీఎం రాజేంద్ర మింజ్ తెలియజేశారు. సమృద్ధి ఒడిశాను ముందుకు నడిపించేందుకు ప్రభుత్వం ఒడిశా చేనేత వస్త్రాలు తయారుచేసే నేత పనివారిని ప్రోత్సాహించేందుకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు.

సాంప్రదాయ దుస్తుల సంబరం ప్రారంభం

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో ప్రభుత్వం తరుపున సాంప్రదాయ దుస్తుల సంబరాలు గురువారం ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా అధికారులు సాంప్రదాయ దుస్తులు ధరించారు. నబరంగ్‌పూర్ కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో చేనేత దుస్తులు ధరించారు. రానున్న రెండు వారాలు ప్రభుత్వ ఉద్యోగులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని సూచించారు. కొరాపుట్ జిల్లా పరిషత్ ప్రెసిడెంట్ సస్మితా మెలక చేనేత చీర ధరించి సిబ్బందికి సందేశం ఇచ్చారు. మరోవైపు కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తివాసన్ సాంప్రదాయ దుస్తులతో కలెక్టరేట్ సిబ్బందితో సందడి చేశారు.



సంబల్‌పురి వస్త్రాధరణలో డీఆర్‌డీఏ అధికారులు, ఉద్యోగులు



కలెక్టరేట్ సిబ్బందితో కలెక్టర్ కీర్తివాసన్



సాంప్రదాయ దుస్తుల్లో కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో

భర్త రూపానికి ప్రాణ ప్రతిష్ట



ప్రతిమ ముందు భార్యాబిడ్డలు



ప్రతిమ ముందు ప్రాణప్రతిష్ట పూజలో కుటుంబ సభ్యులు



భార్య సాగరిక రాయ్

రాయగడ: రెండేళ్ల కిందట అస్వస్థతకు గురై చనిపోయిన భర్త రూపానికి ఆమె మళ్లీ ప్రాణ ప్రతిష్ట చేశారు. సిలికాన్‌తో ఆయన ప్రతిమను రూపొందించి ప్రతిష్ఠించారు. జిల్లాలోని మునిగుడలో వైద్యుడిగా విధులు నిర్వహిస్తుండే సమీర్ రాయ్ కొన్నాళ్ల కిందట మునిగుడలో కుటుంబంతో సహా స్థిరపడ్డారు. రాయ్ 2023లో అనారోగ్యంతో చనిపోయారు. దీంతో అతని భార్య సిలికాన్‌తో రాయ్ ప్రతిమను తయారు చేయించారు. తన బంగారు ఆభరణాలు అమ్మి మరీ ఈ విగ్రహాన్ని రూపొందించారు. మంగళవారం నాడు శుభ ముహూర్తాన పండితుల సమక్షంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రతిమకు ప్రాణ ప్రతిష్ట చేశారు.

వనదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రాణప్రతిష్టలో పాల్గొన్న భక్తులు



వనదుర్గామాత విగ్రహాలను ప్రతిష్ట చేస్తున్న ప్రధాన పూజారులు

పర్లాకిమిడి: స్థానిక కొత్త బస్టాండ్ రోడ్డు దుర్గంపేటలో వనదుర్గా దేవి విగ్రహ ప్రాణప్రతిష్ట, మందిర ప్రారంభోత్సవ కార్యక్రమాలు గురువారం నిర్వహించనున్నారు. పట్టణంలోని అనేకమంది విరాళాలు అందజేశారు. శుక్రవారం నిర్వహించనున్న పూజా కార్యక్రమాలకు బౌద్ధ మందిరం గురువులు విచ్చేయనున్నారు. ఈ నెల 5వ తేదీ వరకు పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలియజేశారు.

జాదవ మజ్జికి ఘన నివాళి



చందాహండిలో జాదవ మజ్జి నివాళులు అర్పిస్తున్న కుమారులు రమేష్, ప్రకాష్

కొరాపుట్: దివంగత పరిశ్రమల మంత్రి జాదవ మజ్జి 26వ వర్ధంతి ఘనంగా జరిగింది. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా చందాహండి సమితి కేంద్రంలో ప్రధాన జంక్షన్ వద్ద జాదవ మజ్జి విగ్రహానికి వందలాది ప్రజలు నివాళులు అర్పించారు. ఇదే సమయంలో చందాహండి ప్రభుత్వ హైస్కూల్‌లో జాదవ మజ్జి విగ్రహానికి నివాళులర్పించారు. జనతా దళ్ పార్టీ నేతృత్వంలో బిజూ పట్నాయక్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 1990–95 మధ్య కాలంలో జాదవ మజ్జి రాష్ట్ర భారీ పరిశ్రమలు, ప్లానింగ్ శాఖ మంత్రి గా పని చేశారు. బిజూకి నమ్మకమైన వ్యక్తులలో జాదవ మజ్జి ఒకరని రాష్ట్ర వ్యాప్తంగా పేరుంది. కార్యక్రమాల్లో అతని కుమారులు మాజీ మంత్రి, బీజేడి జిల్లా ప్రెసిడెంట్ రమేష్ చంద్ర మజ్జి, మాజీ ఎంఎల్ఏ ప్రకాష్ చంద్ర మజ్జి బీజేడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చందాహండి ప్రధాన జంక్షన్‌లో జాదవ మజ్జి భారీ విగ్రహం వద్ద అభిమానులు



చందాహండి ప్రభుత్వ హైస్కూల్‌లో నివాళులు

ధ్వజమెత్తిన రైతులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితిలో లేంప్స్ వార్షిక సమావేశంలో రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తూ అసంతృప్తిని వ్యక్తం చేశారు. లేంప్‌లో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందని, ఈ విషయాన్ని తాము కలెక్టర్, విజిలెన్స్ విభాగానికి తెలియజేశామని, అయినా వారు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని తెలిపారు. లేంప్‌లో పదేళ్లకో మారు సమీక్షలు జరుగుతున్నాయని, అందుకే అవినీతిని పసిగట్టలేకపోతున్నారని తెలిపారు. లక్షలాది రూపాయలతో కొన్న ధాన్యం హార్వెస్టింగ్ మిషన్ మూలన పడి ఉందని, దాన్ని అమ్మేయాని విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కుంద్రా లేంప్స్ కార్యాలయం, గిడ్డంగి గృహాలు శిథిలావస్థలో ఉన్నాయని, రైతులు వస్తే కూర్చునేందుకు కూడా చోటు లేదని తెలిపారు. సమావేశంలో లేంప్స్ కార్యదర్శి పరుశురాం మహారాణ వార్షిక నివేదిక వినిపించారు. ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని, ప్రతి 3 నెలలకు ఓ మారు సమావేశాలు నిర్వహించాలని, ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టును భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వారి డిమాండ్లు విన్న సహకార విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ భీమ్‌సేన్ సాహు వారికి హామీ ఇచ్చారు.

నెక్కంటికి ఉగాది ఉత్సవ కమిటీ సన్మానం



నెక్కంటికి శాలువా కప్పి సన్మానించిన కమిటీ సభ్యులు



విజయోత్సవ సభలో పాల్గొన్న ఉత్సవ కమిటీ సభ్యులు

రాయగడ: రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావును ఉగాది ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్థానిక తేజస్వీ మైదానంలో గురువారం సాయంత్రం ప్రత్యేకంగా నిర్వహించిన ఉగాది విజయోత్సవ సభలో ఆయనను సన్మానించారు. మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ కుమార్ పట్నాయక్, టీవీఎస్‌ఆర్ పట్నాయక్, గొగిన చౌధరి, గుడ్ల గౌరి శంకర్ రావు, ఎస్ త్రినాథరావు, సంఘం నాయుడు, డాక్టర్ బాబురావు మహంతి, బార్జి ప్రసాద్ రావు, డాక్టర్ తులసి దాస్, పట్టణ ప్రముఖులు రాఘవ కుముంధాన్, శిల్లా జగన్నాథ స్వామి తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. తక్కువ సమయంలో ఈ ఏడాది ఉగాది ఉత్సవాలను నిర్వహించినప్పటికీ కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయని అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు.

తండ్రీకొడుకులపై ఆర్మీ జవాన్ దాడి

- పొలం విషయంలో గొడవ
- కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చేరిన బాధితులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పన్న

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీ గంగుపేట గ్రామంలో తండ్రీకొడుకులపై ఓ ఆర్మీ జవాన్ కత్తితో దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంగుపేట గ్రామానికి చెందిన చదునుపల్లి అప్పన్నకు తన అన్న కుమారుడైన ఆర్మీ జవాన్ చదునుపల్లి రాముకు మధ్య కొంతకాలంగా పొలం విషయంలో తగాదాలు ఉన్నాయి. గురువారం ఉదయం ఈ విషయమై అప్పన్నకు రాముకు మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో రాము కత్తితో చిన్నాన్న అప్పన్నపై దాడి చేశాడు. తొడ, చేతులను తీవ్రంగా గాయపరిచాడు. అప్పన్న కుమారుడు హరిబాబు అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనికి సైతం గాయాలయ్యాయి. గ్రామస్తులు కలుగచేసుకుని గొడవను ఆపి బాధితులను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో షిఫ్ట్ ఆపరేటర్ మృతి

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం ఫ్లై ఓవర్ వంతెనపై గురువా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలా స సబ్‌స్టేషన్ షిఫ్ట్ ఆపరేటర్ సంపతి రావు రవికిరణ్(38) మృతి చెందాడు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జలుమూరు మండలం కరవంజ పంచాయతీ తుంబయ్యపేటకు చెందిన రవికిరణ్ పలాస విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై పలాస వెళ్తుండగా నందిగాం ఫ్లై ఓవర్ బ్రిడ్జి పైకి వచ్చేసరికి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఎగిరిపడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికు ల సమాచారం మేరకు హైవే అంబులె న్స్ సిబ్బంది వచ్చి రవికిరణ్‌ను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవికిరణ్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం హెడ్ కానిస్టేబు ల్ బి.వి. రమణ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లర్క్.. పీఓ.. ఆర్‌పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్



తల్లిదండ్రులతో బాలమురళి

సరుబుజ్జిలి : మండలంలోని షళంత్రి పంచాయతీ మర్రిపాడు గ్రామానికి చెందిన వాకముల్ల బాలమురళి ఒకేసారి 4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. బీటెక్ పూర్తిచేసిన బాలమురళి వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకున్నాడు. 2025 ప్రారంభంలో విడుదలైన ఆర్‌ఆర్‌బీ(రూరల్ రిక్రూట్‌మెంట్ బ్యాంకు)లో పీఓ, క్లర్క్ పోస్టులకు ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన ఐబీపీఎస్ నేషనల్ బ్యాంకులో క్లర్కు, ఆర్‌పీఎఫ్ విభాగంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సైతం ఎంపికయ్యాడు. ప్రస్తుతం పల్నాడు జిల్లా రెంటచింతలో చైతన్య గోదావరి రూరల్ బ్యాంకులో పీఓగా పనిచేస్తున్నాడు. ఈయన తండ్రి వాకముల్ల రమణమూర్తి జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యుడిగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణి. ఒకేసారి నాలుగు పోస్టులకు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

షికారుకెళ్తారు..

సర్వం దోచేస్తారు



- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన గజదొంగలు
- 17 చోరీలు చేసిన ఇద్దరు నిందితుల అరెస్టు
- ఒకరిది శ్రీకాకుళం జిల్లా ముద్దాడ, మరొకరిది పార్వతీపురం మన్యం జిల్లా జోగంపేట
- 37 తులాల బంగారం, 20 తులాల వెండి రికవరీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ :

బండిపై సాయంత్రం అలా షికారుకి వెళ్లినట్లు తామెంచుకున్న గ్రామానికి వెళతారు.. వెంట తీసుకెళ్లిన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి తిరిగి వెళ్లిపోతారు.. అదే రోజు రాత్రి చోరీ ఎక్కడ చేద్దామనుకున్నారో.. ఆ ఇంటికి కాస్త దూరంలో బండి పార్కింగ్ చేసి వారి వెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, స్క్రూ డ్రైవర్‌తో ఇంటి తాళాలు పగులగొడతారు.. బీరువా తలుపులు విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, బంగారం, వెండి దోచుకుని పరారవుతారు.. శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది చోట్ల, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక చోట కలిసి మొత్తం 17 చోట్ల ఇలా చోరీలు చేసి ఎట్టకేలకు కాశీబుగ్గ పోలీసులకు చిక్కారు. వీరి వద్ద నుంచి 37 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండిని స్వాధీనపర్చుకున్నారు. ఈ మేరకు నిందితు లైన పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగంపేటకు చెందిన పోలా భాస్కరరావు, శ్రీకాకుళం ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నర్సింగరావులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు.

కాశీబుగ్గ పోలీసులకు చిక్కి..

గతేడాది మే 24న కాశీబుగ్గ పీఎస్ పరిధిలో బంగారం, వెండి చోరీ చేసిన కేసులో నిందితులైన భాస్కర్, నర్సింగరావులు గురువారం నర్సిపురం రైల్వేగేట్ ఎక్స్–సర్వీస్‌మ్యాన్ క్యాంటీన్ ఎదురుగా వాహన తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ పోలీసులకు చిక్కారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వి.అప్పారావు ఆధ్వర్యంలో సీఐ చంద్రమౌళి నిందితులను విచారించగా వారు చేసిన ఒక్కొక్క నేరం వెలుగులోకి వచ్చాయి. కాశీబుగ్గ, మెళియాపుట్టి, జె.ఆర్.పురం, టెక్కలి పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి, శ్రీకాకుళం రూరల్, వన్ టౌన్, టూ టౌన్‌లో మూడేసి చోరీలు, పాతపట్నంలో రెండు చోరీలు చేయగా మన్యం జిల్లా పాలకొండలో రెండు చోట్ల చోరీలకు పాల్పడ్డారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలివే..



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు


17 కేసుల్లో 76 తులాలకు గాను రూ.36.80 లక్షల విలువైన 37 తులాల బంగారు ఆభరణాలు, 184.58 తులాల వెండికి గాను 20 తులాల వెండి, రూ.5 లక్షలు విలువ చేసే డైమండ్ ఆభరణాలకు గాను రూ.2 లక్షలు విలువైన డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ లాకెట్, రూ. 3.44 లక్షల నగదుకు గాను రూ.25 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష విలువైన రెండు బైక్‌లు, రూ.2 లక్షలు విలువైన ఓ స్కార్పియో వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించడంలో కృషిచేసిన కాశీబుగ్గ పోలీసులను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

చిన్నప్పటి నుంచే..

భాస్కరరావు తన తొమ్మిదో సంవత్సరంలోనే అప్పయ్యపేట షుగర్ ఫ్యాక్టరీ కాలనీలో ఓ ఇంట్లో డబ్బులు దొంగిలించడంతో సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో జువైనల్ కేసు నమోదైంది. మూడు నెలలు పాటు విశాఖ అబ్జర్వేషన్ హోంలో ఉన్నాడు. అప్పటి నుంచే నేర ప్రవృత్తిని ఎంచుకున్నాడు. ఇక నర్సింగరావు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తూ బైక్‌ను దొంగిలించి జైలుకి వెళ్లాడు. ఇద్దరికీ విశాఖపట్నం సెంట్రల్ జైలులో పరిచయమేర్పడి బయటకొచ్చాక రాత్రిపూట చోరీలు చేయడం మొదలుపెట్టారు.

లెక్కకు మించి కేసులు..

నిందితుల్లో ఒకరైన పోలా భాస్కరరావుపై శ్రీకాకుళంలో 19, విజయనగరంలో 16, విశాఖపట్నం(రూరల్–2) జిల్లాల్లో 37 చోరీ కేసులు నమోదవ్వగా ఎనిమిదింటి లో నేరారోపణ రుజువై జైలు శిక్ష అనుభవించాడు. నర్సింగరావుపై 17 కేసులుండ గా (శ్రీకాకుళం–9, విజయనగరం–4, విశాఖపట్నం సిటీ–3, పార్వతీపురం మన్యం–1) మూడింటిలో నేరారోపణ రుజువై జైలు శిక్ష అనుభవించాడు.



క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

● 6.25 తులాల బంగారం, రూ.5వేలు స్వాధీనం



పట్టుబడిన నిందితుడు

సంతకవిటి: దొంగతనం కేసులో నిందితుడిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆర్.గోపాలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాలలోకి వెళ్తే..సంతకవిటి మండలంలోని మండాకురిటి గ్రామంలో దేవిరెడ్డి అప్పలనరసమ్మ ఇంటిలో బంగారం, నగదు పోయినట్లు ఈ నెల 21న పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో అదే గ్రామంలోని గాజులవీధికి చెందిన బత్తుల గణేష్ దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో నిందితుడు నేరం అంగీకరించడంతో 6.25 తులాల బంగారం, రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు కొండవెలగాడ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం జ్ఞాన శంకర్, సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: రాజమండ్రిలో జరగనున్న రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటిన ఎనిమిది మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారని హెచ్‌ఎం జ్ఞాన శంకర్, పీఈటీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాలలో గురువారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్నికాయిట్ పోటీల్లో బ్రాంజ్‌మెడల్ కైవసం

● జాతీయ పోటీల్లో సత్తా చాటిన గరివిడి క్రీడాకారిణులు



బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్న క్రీడాకారిణులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): నేషనల్ టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీల్లో గరివిడి మండలంలో ని కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడా కారిణులు ప్రతి భ చాటి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. మార్చి 26 నుంచి 31 వరకు ఒడిశాలో జరిగిన 48వ సీనియర్ నేషనల్ టెన్నికాయిట్ చాంపియన్ షిప్ 2024-25లో గరివిడి మండలం కొండలక్ష్మీపురం గ్రామానికి చెందిన క్రీడాకారిణులు ఆర్.మౌనిక, పి.రేణుక, జి.శ్రావణి పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించిన క్రీడాకారిణులకు టెన్నికాయిట్ అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ ట్రాక్టర్ల పట్టివేత



ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న ఆర్ఐ రామకుమార్

బొబ్బిలిరూరల్: బొబ్బిలి మండలంలోని చింతాడ గ్రామం వద్ద ఉన్న చెరువులో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆర్ఐ కొల్లి రామకుమార్ గురువారం పట్టుకున్నారు. చెరువులో గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారని గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఆర్ఐ రామకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లపై ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్ఐ తెలిపారు.

ఆటో ఢీకొని తండ్రీకూతుళ్లకు తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో బాలాజీ

బొబ్బిలి: పట్టణంలో ద్విచక్రవాహనాన్ని ఓ ఆటో ఢీకొనడంతో తండ్రీకూతుళ్లు తీవ్ర గాయాల పాలయ్యారు. గురువారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఐటీఐ కాలనీకి చెందిన కె.బాలాజీ, కుమార్తె మౌనిక ద్విచక్రవాహనంపై పట్టణంలోకి వెళ్తున్నారు. అదే సమయంలో పట్టణం నుంచి ఐటీఐ కాలనీ వైపు వస్తున్న ఆటో వారి బైక్‌ను ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో తండ్రీకూతుళ్లిద్దరికి కాళ్లు ఫ్రాక్చరయ్యాయి. వెంటనే వారిని సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

ఎట్టకేలకు గజదొంగల ఆటకట్టు..!

● షికారు కెళ్లినట్లు వెళ్లి..సర్వం చోరీ
● 17 కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు
● ఒకరిది శ్రీకాకుళం జిల్లా, మరొకరిది పార్వతీపురం మన్యం జిల్లా
● 37 తులాల బంగారం, 20 తులాల వెండి రికవరీ
● వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: బండిపై సాయంత్రం అలా షికారుకు వెళ్లినట్లు తామెంచుకున్న గ్రామానికి వెళ్తారు. వెంట తీసుకెళ్లిన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి తాళాలు వేసి ఉన్న ఇళ్లను రెక్కీ చేసి తిరిగి వెళ్లిపోతారు. అదే రోజు రాత్రి చోరీ ఎక్కడ చేద్దామనుకున్నారో..ఆ ఇంటికి కాస్త దూరంలో బండి పార్కింగ్ చేసి వారివెంట తెచ్చుకున్న ఇనుప రాడ్డు, స్క్రూ డ్రైవర్‌తో ఇంటి తాళాలు పగులగొడతారు. బీరువా తలుపులు విరగ్గొట్టి అందులో ఉన్న నగదు, బంగారం, వెండి దోచుకుని పరారవుతారు. శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది చోట్ల, పార్వతీపురం మన్యం జిల్లాలో ఒకచోట చోరీలు చేసి ఎట్టకేలకు కాశీబుగ్గ పోలీసులకు ఆ గజదొంగలు చిక్కారు. దీంతో వారి దగ్గర నుంచి 37 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండిని పోలీసులు స్వాధీనం చేసకున్నారు. ఈ మేరకు నిందితులైన పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం జోగింపేటకు చెందిన పోలా భాస్కరరావు, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ముద్దాడ గ్రామానికి చెందిన ముద్దాడ నర్సింగరావులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు.

చిన్నప్పటి నుంచే..

భాస్కరరావు తన తొమ్మిదో సంవత్సరంలోనే అప్పయ్యపేట సుగర్ ఫ్యాక్టరీ కాలనీలో ఓ ఇంట్లో డబ్బులు దొంగిలించడంతో సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో జువైనల్ కేసు నమోదైంది. మూడు నెలలపాటు విశాఖ అబ్జర్వేషన్ హోంలో ఉన్నాడు. అప్పటి నుంచే నేర ప్రవృత్తిని ఎంచుకున్నాడు. ఇక నర్సింగరావు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఓ బైక్ షోరూంలో



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

పనిచేస్తూ బైక్‌ను దొంగిలించి జైలుకు వెళ్లాడు. ఇద్దరికీ విశాఖపట్నం సెంట్రల్ జైలులో పరిచయమేర్పడి బయటకొచ్చాక చోరీలు చేయడం మొదలుపెట్టారు.

లెక్కకు మించి కేసులు..

నిందితుల్లో ఒకరైన పోలా భాస్కరరావుపై శ్రీకాకుళంలో 19, విజయనగరంలో 16, విశాఖపట్నం(రూరల్-2) జిల్లాల్లో 37 చోరీ కేసులు నమోదు కాగా, ఎనిమిదింటిలో నేరారోపణ రుజువై జైలు శిక్ష అనుభవించాడు. నర్సింగరావుపై 17 కేసులుండగా (శ్రీకాకుళం-9, విజయనగరం-4, విశాఖపట్నం సిటీ-3, పార్వతీపురం మన్యం-1) మూడింటిలో నేరారోపణ రుజువై జైలుశిక్ష అనుభవించాడు.

కాశీబుగ్గ పోలీసులకు చిక్కి..

గతేడాది మే 24న కాశీబుగ్గ పీఎస్ పరిధిలో బంగారం, వెండి చోరీ చేసిన కేసులో నిందితులైన భాస్కర్, నర్సింగరావులు గురువారం నర్సిపురం రైల్వేగేట్ ఎక్స్-సర్వీస్‌మ్యాన్ క్యాంటీన్ ఎదురుగా చేస్తున్న వాహన తనిఖీల్లో భాగంగా కాశీబుగ్గ పోలీసులకు చిక్కారు. కాశీబుగ్గ డీఎస్పీ వి.వి.అప్పారావు ఆధ్వర్యంలో సీఐ చంద్రమౌళి నిందితులను విచారణ చేయగా వారు చేసిన ఒక్కో నేరం వెలుగులోకి వచ్చాయి. కాశీబుగ్గ, మెళియాపుట్టి, జేఆర్ పురం, టెక్కలి పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి, శ్రీకాకుళం రూరల్, వన్‌టౌన్, టూటౌన్‌లో మూడేసి చోరీలు, పాతపట్నంలో రెండు చోరీలు చేయగా మన్యం జిల్లా పాలకొండలో రెండు చోట్ల చోరీలకు పాల్పడ్డారు.

స్వాధీనం చేసుకున్న ఆభరణాలివే..

17 కేసుల్లో 76 తులాలకు గాను రూ.36.80 లక్షల విలువైన 37 తులాల బంగారు ఆభరణాలు, 184.58 తులాల వెండికి గాను 20 తులాల వెండి, రూ.5 లక్షలు విలువ చేసే డైమండ్ ఆభరణాలకు గాను రూ.2 లక్షలు విలువైన డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ లాకెట్, రూ.3.44 లక్షల నగదుకు రూ.25 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూ.లక్ష విలువైన రెండు బైక్‌లు, రూ.2 లక్షల విలువైన ఓ స్కార్పియోను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించడంలో కృషిచేసిన కాశీబుగ్గ పోలీసులను ఎస్పీ మహేశ్వరరెడ్డి అభినందించారు.

ప్రతిమహిళ లక్షాధికారి కావాలి

● కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని స్వయం సహాయక బృందాల్లోని ప్రతి మహిళ లక్షాధికారి కావాలని, ఆ దిశగా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2.30 లక్షల మంది మహిళా సభ్యులు ఉండగా, వారిలో సగానికి పైగా లక్షలోపు వార్షిక ఆదాయం ఉన్నవారే ఉన్నారన్నారు. వారందరినీ వ్యాపారాల్లో ప్రోత్సహించి లక్షాధికారులుగా తీర్చిదిద్దాలన్నారు. ఎస్‌హెచ్‌జీతో పాటు డీఆర్‌డీఏ, వెలుగు సంస్థలు అందించే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ నిధులతో చెరువు గట్లపై కొబ్బరి, పనస వంటి ఫలసాయాలు ఇచ్చే మొక్కలు పెంచాలని సూచించారు. చేపల పెంపకంలో మహిళల భాగస్వామ్యం కూడా పెరగాలన్నారు. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్ల నిర్వహణతో మహిళలు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి, ఏపీడీ వై.సత్యంనాయుడు, పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి. కరుణాకర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్

సాయికృష్ణ చైతన్య, జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ ఎస్.మన్మథరావు, ఐటీడీఏ ఏపీఓ మురళీ మోహన్, ఇతర శాఖాధికారులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ సంస్థ డైరీ ఆవిష్కరణ

పార్వతీపురంటౌన్: రాష్ట్ర గృహ నిర్మాణసంస్థ రూపొందించిన డైరీని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న గృహాలను త్వరితగతిన పూర్తిచేసే గురుతర బాధ్యత ఇంజినీర్లపైనే ఉందన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్, గృహనిర్మాణ సంస్థ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి, హౌసింగ్ డీఈఈలు, ఏఈఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న గడువు

● అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: గిరిజన సబ్ ప్లాన్ (టీఎస్‌పీ) ప్రాంత అంగన్వాడీ పోస్టుల భర్తీకి శుక్రవారంతో గడువు ముగియనున్నట్లు ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో తొమ్మిది అంగన్వాడీ వర్కర్లు, 15 అంగన్వాడీ హెల్పర్లు, 12 మినీ అంగన్వాడీ కార్యకర్తల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు ఖాళీలు ఇలా ఉన్నాయి.

● పార్వతీపురం డివిజన్ పరిధిలో వీఆర్‌పేట అంగన్వాడీ వర్కర్-1, అంగన్వాడీ హెల్పర్-1, మినీ అంగన్వాడీ-1. అలాగే కొమరాడలో మినీ అంగన్వాడీలు-2, సాలూరులో అంగన్వాడీ వర్కర్లు-2, హెల్పర్లు-2, మినీ అంగన్వాడీలు-2, పాచిపెంట మండలంలో అంగన్వాడీ వర్కర్లు -1, హెల్పర్లు -5, మినీ అంగన్వాడీలు-5, మక్కువ మండలంలో అంగన్వాడీ వర్కర్లు -3, హెల్పర్-1 భర్తీ చేయనున్నామన్నారు.

● పాలకొండ డివిజన్‌లోని కురుపాం మండలంలో అంగన్వాడీ వర్కర్-1, హెల్పర్-1, జియ్యమ్మవలసలో హెల్పర్-2, భద్రగిరిలో అంగన్వాడీ వర్కర్ -1, హెల్పర్-1, గుమ్మలక్ష్మీపురంలో హెల్పర్-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అర్హులైన వివాహిత అభ్యర్థినులు, దరఖాస్తులను ఏప్రిల్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం వచ్చిన దరఖాస్తుదారులను మాత్రమే ఇంటర్వ్యూకు పిలవనున్నట్లు స్పష్టం చేశారు. అంగన్వాడీ వర్కర్లు, సహాయకులు, మినీ అంగన్వాడీల నియామకానికి స్థానిక స్థిరనివాసం కలిగిన వివాహితల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. అంగన్వాడీ సహాయకులకు జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. ఎస్టీ కేంద్రాలకు ఎస్టీ కేటగిరికి రోస్టర్‌లో రిజిస్టర్ అయిన పోస్టులకు 21 ఏళ్లు నిండిన అభ్యర్థులు లేని యెడల 18 ఏళ్లు నిండిన వారిని పరిగణనలోకి తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అంగన్వాడీ సహాయకుల ఎంపికలో గ్రామం స్థానికత ప్రాతిపదికగాను, దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేసి రశీదును తీసుకోవాలని సూచించారు.

లైవ్ స్టాక్ ద్వారా జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

● కలెక్టర్ డాక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: మాంసం, గుడ్లు, పాడి ఉత్పత్తి ద్వారా జిల్లాలో అభివృద్ధి సూచీలను పెంచడానికి తగు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ సూచించారు. జిల్లా అభివృద్ధిలో కీలకమైన వ్యవసాయ అనుబంధ రంగంలో లైవ్‌స్టాక్ పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశుసంవర్ధక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల మహిళా సమాఖ్య ద్వారా ప్రతి మండలంలో గుడ్లు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తికి సూచించారు. అందుకు కావాల్సిన సాంకేతికపరమైన సహకారాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు అందించాలని కోరారు. అందుకోసం రానున్న 10 రోజుల్లో ప్రణాళికలు వేసి ఇవ్వాలని ఆదేశించారు. అదేవిధంగా నియోజకవర్గానికి ఒక మహిళా ఎంట్రప్రెన్యూర్‌ను గుర్తించి గొర్రెలు, మేకల యూనిట్ల ఏర్పాటుకు కూడా సబ్సిడీపై రుణాలు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో పశుగ్రాసం కోసం ప్రతిపాదనలు పంపారని అన్ని మండలాలకు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇంకా ఏ రకంగా లైవ్‌స్టాక్‌ను పెంచగలమో చర్చించి ప్రతిపాదనలతో రావాలని పశువైద్యాధికారులకు సూచించారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వైవీ రమణ, ముఖ్యప్రణాళిక అధికారి బాలాజీ, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి, మండల పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ 5వ బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ

● పోలీస్ శిక్షణ కేంద్రంలో వసతుల పరిశీలన

డెంకాడ: చింతలవలసలోని ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్‌ను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి గురువారం సందర్శించారు. ఆయనకు బెటాలియన్ కమాండెంట్ మలికాగార్గ్ మొక్కను అందించి స్వాగతం పలికారు. బెటాలియన్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో మౌలిక వసతులను డీఐజీ పరిశీలించారు. తరగతి గదులు, ఆఫీస్, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్, వాష్ రూంలను పరిశీలించారు. మినరల్ వాటర్‌ప్లాంట్, లైబ్రరీ, పరేడ్ గ్రౌండ్ స్థితిగతుల వివరాలను మలికాగార్గ్‌ను అడిగి తెలుసుకున్నారు. అదనపు వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. శిక్షణ కేంద్రంలో పని చేస్తున్న



ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్‌లో పర్యటిస్తున్న డీఐజీ గోపీనాథ్ జట్టి, కమాండెంట్ మలికాగార్గ్, ఎస్పీ వకుల్ జిందాల్

టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఐజీ వెంట ఎస్పీ వకుల్ జిందాల్, బెటాలియన్ పోలీస్ అధికారు ఉన్నారు.

మాంగనీసు తవ్వకాలపై నిషేధం

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ పంచాయతీ పరిధి బంకురు వలసలో 'మాంగనీసు అక్రమ తరలింపు' అన్న కథనం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో జిల్లా భూగర్భ గనుల శాఖ స్పందించింది. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. బంకురువలసలో సర్వేనంబర్ 1లో ఉన్న మాంగనీసు ఖనిజ ప్రాంతం గతంలో చెలికాని అచ్యుతరావు పేరున నమోదైందని, అక్కడ మాంగనీసు ఉండేదని తెలియజేసింది. అనంతరం నమ్రత మైనింగ్ కార్పొరేషన్ పార్టనర్ ఇక్బాల్ షరీఫ్ పేరున సేల్‌డీడ్ జరిగిందని వివరించింది. అయితే అచ్యుతరావు పేరున ఉన్న భూమి ఇంకా ఇక్బాల్ షరీఫ్‌కు మ్యూటేషన్ కాలేదని, మైనింగ్ శాఖనుంచి మాంగనీసు తవ్వకాలకు, తరలింపునకు ఎటువంటి అనుమతులు లేవని పేర్కొంది. నిరంతర తనిఖీలతో ఆప్రాంతలో నిఘా ఏర్పాటు చేశామని ఎవరైనా మాంగనీసు ఖనిజతవ్వకాలు, తరలింపు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

శభాష్ శివాని..!



తల్లిదండ్రులతో సాయిశివాని

రాజాం సిటీ: స్థానిక ఈశ్వరనారాయణ కాలనీకి చెందిన సిద్ధాంతం సాయి శివాని ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలకు ఎంపికై సత్తా చాటింది. ఈ నెల ఒకటో తేదీన విడుదలైన ఐబీపీఎస్ ప్రొబేషనరీ ఆఫీసర్ ఫలితాల్లో సత్తాచాటి బ్యాంకు ఆఫ్ బరోడాలో పీవోగా నియమితురాలైంది. అలాగే ఇటీవల ఐబీపీఎస్ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులో పీవోగా ఎంపికై ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు కడప బ్రాంచిలో పీవోగా, అదే బ్యాంకులో క్లర్క్‌గా కూడా పోస్టు దక్కించుకుంది. సాయి శివానికి మూడు బ్యాంకు ఉద్యోగాలు రావడం పట్ల పలువురు ఉద్యోగులు, కుటుంబసభ్యులు ఆమెను అభినందించారు. ఆమె రాజాంలోని శ్రీచైతన్య స్కూల్‌లో పదోతరగతి, విశాఖపట్నం శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. విజయనగరం జేఎన్‌టీయూలో బీటెక్ (ఈఈఈ) పూర్తి చేసింది. బ్యాంకు ఉద్యోగం సంపాదించాలన్న తన కల నెరవేరిందని సాయి శివాని సాక్షికి తెలిపింది. సాయిశివాని తండ్రి సిద్ధాంతం భానుమూర్తి రేగిడి మండలం ఏవీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి ప్రభావతి చీపురుపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతుల క్రీడాశిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న డీఎస్‌డీఓ ఎస్. వెంకటేశ్వరరావు

పార్వతీపురం టౌన్: విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆరు వారాల పాటు క్రీడాశిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం స్థానిక డీఎస్‌డీఓ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో 2025వ సంవత్సరానికి విభిన్న ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఆరు వారాల పాటు ఇవ్వనున్న శిక్షణ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి 20 నుంచి 42ఏళ్ల మధ్య వయస్సు గల వారు అర్హులన్నారు. మినిమం 1,2,3 పొజిషన్‌లో అంతర స్కూల్, కళాశాల, యూనివర్సిటీ క్రీడాపోటీలు, సంబంధిత క్రీడా సంఘాలు నిర్వహించే క్రీడల్లో రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొన్న క్రీడాకారులు అర్హులని స్పష్టం చేశారు. ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, సైక్లింగ్, క్రికెట్, ఫెన్సింగ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, జుడో, కబడ్డీ, ఖోఖో, రోల్‌బాల్, రోలింగ్, సాఫ్ట్‌బాల్, షూటింగ్, స్విమ్మింగ్, తైక్వాండో, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, యోగాసనాల వంటి క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. దరఖాస్తులను హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.6డబ్ల్యూసీసీ.ఎన్ఎస్ఎన్ఐఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా ఏప్రిల్ 14వ తేదీలోగా చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8712622564, 9866805716 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పోలీస్ ట్రైనింగ్ కళాశాల తనిఖీ

విజయనగరం క్రైమ్: స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న పోలీస్ శిక్షణ కళాశాలను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామభద్రపురం వెళ్తున్న డీఐజీ ముందుగా నగరంలోని పోలీస్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న శిక్షణ కళాశాలను విజిట్ చేశారు. కళాశాలలో గ్రైండ్ బ్యారెక్, డైనింగ్ హాల్, అడ్మిన్ బ్లాక్, లైబ్రరీని పరిశీలించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్రరాజు శిక్షణార్థులకు ఇస్తున్న శిక్షణను డీఐజీకి తెలియజేశారు. తరగతుల్లో ఎన్డీపీఎస్, పోక్సో, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా, క్రిమినల్ లా వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. కానిస్టేబుల్స్‌కు అత్యుత్తమమైన శిక్షణ ఇవ్వాలని పీటీసీ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీకి డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. అంతకు ముందు పీటీసీకి వచ్చిన డీఐజీకి ఎస్పీ వకుల్ జిందల్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పారావు, డీఎస్పీలు, శ్రీకాంత్, రమేష్, భవానిలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం పరిశీలన

విజయనగరం క్రైమ్: నగర శివారు సారిపల్లిలో ఉన్న జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పరిశీలించారు. విజయనగరం వచ్చిన డీఐజీ, ఎస్పీ వకుల్ జిందల్, ఏఎస్పీ సౌమ్యలతతో కలిసి డీటీసీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కానిస్టేబుల్స్ నియామకాలు త్వరలో పూర్తి కానున్న నేపథ్యంలో డీటీసీని డీఐజీ పరిశీలించారు.ఈ సందర్భంగా శిక్షణ కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామని రేంజ్ డీఐజీ చెప్పారు. కేంద్రంలో ఉన్న గదులు, మంచాలు, పరుపులు, క్రీడా సామగ్రి, ఆఫీస్ స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ వీరకుమార్, భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ, సీఐ లలిత, ఆర్ఐ గోపాల నాయుడు పాల్గొన్నారు.

396 కేజీల గంజాయి పట్టివేత

● పరారైన నిందితులు



పట్టుబడిన గంజాయితో ఏఎస్పీ అంకిత సురానా, పోలీసులు

సాలూరు రూరల్: పాచిపెంట మండలం ఆలూరు గ్రామం గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాంతంలో గురువారం తెల్లవారుజామున 4గంటలకు రెండువాహనాల్లో తరలిస్తున్న 396 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్పీ అంకితా సురానా విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్న ముందస్తు సమాచారం మేరకు గురువారం ఉదయం 4 గంటల సమయంలో రూరల్ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కాపుకాశారన్నారు. గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు నిందితులు పోలీసుల రాకను గమనించి వాహనాలను విడిచి ఒక్కొక్కరు ఒక్కో దిశలో పారిపోయారని తెలిపారు. చీకటి కావడంతో నిందితులు పరారయ్యేందుకు అవకాశం దొరికిందన్నారు. వాహనాల్లో 396 కేజీల గంజాయి పట్టుపడిందని దాని విలువ సుమారు రూ.39 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో రూరల్ అర్బన్ సీఐలు రామకృష్ణ, అప్పలనాయుడు రూరల్ ఎస్సై నరసింహమూర్తి, పాచిపెంట ఎస్సై పాల్గొన్నారు.

సమష్టి కృషితో వైద్యారోగ్యశాఖకు గుర్తింపు

● డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

పార్వతీపురంటౌన్: అంకిత భావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు అందించాలని జిల్లా వైద్యరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు కార్యాలయ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారులు, సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ప్రజారోగ్యం దృష్ట్యా జిల్లాలో చెపడుతున్న ప్రతి కార్యక్రమానికి సంబంధించిన ప్రగతి నివేదికలను ఎప్పటికప్పుడు సిద్ధం చేసి సకాలంలో అందజేయాలని సూచించారు. తద్వారా వెనుకంజలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను గుర్తించి అందుకు గల కారణాలపై విశ్లేషణ్ చేసి పనితీరును మెరుగుపర్చవచ్చన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు తీరును పర్యవేక్షించాలని చెప్పారు. ఈ క్రమంలో మాతా, శిశు వైద్య సేవలు, టీకాల నిర్వహణ, అసంక్రామిక వ్యాధుల సర్వే, టీబీ, లెప్రసీ, స్కూల్ హెల్త్, స్వచ్ఛాంధ్ర తదితర ఆరోగ్య కార్యక్రమాలు జిల్లాలో పకడ్బందీగా అమలు జరిగేలా పర్యవేక్షణ చేసి, సంబంధిత పోర్టల్స్, యాప్‌లో నమోదు తీరును పరిశీలించాలని సూచించారు.

కార్యక్రమంలో డీఐఓ ఎం. నారాయణరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జగన్మోహనరావు, డాక్టర్ పీఎల్ రఘుకుమార్, డాక్టర్ ఎం.వినోద్ కుమార్, సూపరింటెండెంట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామానికి చెందిన మునికోటి చిన్నారావు(60) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటి సమీపంలోని పశువుల పాకలో ఉరి వేసుకుని ప్రాణం తీసుకున్నాడు. గురువారం ఉదయం మృతుడి కుమారుడు మునికోటి రవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య పుష్ప మూడు నెలల కిందట అనారోగ్యంతో మరణించింది. దీంతో అప్పటి నుంచి మనస్తాపంలో ఉన్నాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పురుగు మందు తాగి మరో వ్యక్తి..

పార్వతీపురంటౌన్: గరుగుబిల్లి మండలంలోని వల్లరిగుడబ గ్రామానికి చెందిన మం రజక వృత్తిదారు పలగర్ర పోలి (40) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం జరిగిన ఈ ఘటనపై జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో ఒక వ్యక్తి మృతి చెందగా దహన సంస్కారాలు చేసిన అనంతరం పలగర్ర పోలి మద్యం తాగి ఇంటికివచ్చాడు. నీకు రోజూ ఇదే అలవాటు అయిపోయిందని భార్య మందలించడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ విషయం భార్యకు తెలియడంతో వెంటనే అప్రమత్తమై కుటుంబసభ్యుల సహకారంతో ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గరుగుబిల్లి పోలీసులు కేసునమోదు చేసినట్లు ఔట్‌పోస్టు ఏఎస్సై నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

హత్యకేసులో ముద్దాయికి జీవిత ఖైదు

విజయనగరం క్రైమ్: కొత్తవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల కిందట నమోదైన హత్య కేసులో ముద్దాయి జోడి నాగరాజుకు విజయనగరం జిల్లా సెషన్స్ జడ్జి కల్యాణ చక్రవర్తి యావజ్జీవ ఖైదు విధిస్తూ గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. 2022లో కొత్తవలస మండలం అప్పన్నదొరపాలెం జోడుమెరకకు చెందిన జోడి నాగరాజు తన భార్య లక్ష్మి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి కొత్తవలస సీఐ బాలసూర్యారావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా, భార్యను పెట్రోల్ పోసి నాగరాజే కాల్చివేసినట్లు నిర్ధారణ అయ్యింది. అతనికి సహకరించిన మౌనికపై అభియోగపత్రాలు నమోదుచేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నాగరాజు ఒక్కడిపైనే నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ తెలిపారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ వాదనలు వినిపించారు. సాక్షులను కొత్తవలస సీఐ షణ్ముఖరావుతో పాటు ఎస్ఐ ఈశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ ఎర్నినాయుడు సకాలంలో ప్రవేశ పెట్టారని ఎస్పీ తెలిపారు.